నాడు- నేడు ప్రతిబింబం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. నాడు- నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. అవసరమైన సిబ్బందితో **పాటు వైద్యులను** నియమించి పేద ప్రజలకు వైద్య భరోసా కల్పించారు. ఇలా రూ.17 కోట్లతో **అగనంపూడి** ప్రాంతీయ ఆస్పత్రి రూపు రేఖలు మార్చారు. పూర్తిస్థాయిలో వసతులతో పాటు **వైద్యులు, సిబ్బందిని** నియమించడంతో నాటి ఫలాలు ప్రస్తుతం ప్రజలకు అందుతున్నాయి. **అగనంపూడి ఏరియా** ఆస్పత్రి రోగులతో నిత్యం కిటకిటలాడుతోంది.



అగనంపూడి ఏరియా ఆస్పత్రి

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రి స్థాయి పెంచాలని, సిబ్బందిని సరిపడా నియమించాలని 15 ఏళ్లుగా ప్రజలు మొరపెట్టుకున్నా ఏ ప్రభుత్వం స్పందించలేదు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు- నేడు కార్యక్రమంలో అగనంపూడి ఆస్పత్రికి కొత్త రూపురేఖలు తీసుకురావడంతోపాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. 2024 నాటికి నిర్మాణ పనులు 85శాతం పూర్తి కాగా, అవసరమైన పరికరాలు అప్పట్లోనే కొనుగోలు చేశారు. మిగిలిన పనులు ఇటీవల పూర్తయ్యాయి.

35 మంది నుంచి 96కి చేరిన సిబ్బంది

2018లో అప్పటి ప్రభుత్వం ఆస్పత్రి స్థాయి పెంచింది. అయితే అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. జగన్ ప్రభుత్వం వచ్చిన నాటికి 35 మంది ఉన్న సిబ్బందిని 96కి పెంపుదల చేశారు. అప్పటి వరకు వైద్యులు 9 మంది ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 23కి చేరింది. నర్సింగ్ సిబ్బంది ఏఎన్‌ఎంలతో కలిపి 14 మంది ఉండగా వారిని 32 మందికి పెంచారు. ఫార్మసిస్టులు గతంలో ఇద్దరు ఉంటే ఐదుగురికి చేరింది. ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు ఉండేవారు. ముగ్గురు అయ్యారు. అలాగే రక్త నిల్వల కేంద్రంలో మరో ముగ్గురు కలిపి ఆరుగురు ప్రస్తుతం ల్యాబ్‌లో ఉంటున్నారు.

ఓపీ రెట్టింపు

ఆస్పత్రిలో వసతుల కల్పనకు ముందు ఓపీ రోజుకు సరాసరి 250 నుంచి 300 నమోదు అయ్యేది. ప్రస్తుతం 700 వరకూ నమోదవుతోంది. పాత ఆవరణలోనే వైద్య సేవలు కొనసాగుతుండడంతో మరీ రద్దీగా కనబడుతోంది. కొద్ది రోజుల్లో నూతన బ్లాక్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపీ కృష్ణ తెలిపారు.

పరిపాలనాభవనం, వార్డుల భవన సముదాయం



- గత ప్రభుత్వంలో రూ. 17కోట్లతో అభివృద్ధి పనులు
- మారిన అగనంపూడి ఏరియా ఆస్పత్రి రూపురేఖలు
- సౌకర్యాల కల్పనతో రోగుల తాకిడి రెట్టింపు
- 2019కి ముందు 35 మంది సిబ్బంది
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 96కి చేరిన సిబ్బంది

అందుబాటులో స్టెమీ


స్టెమీ ప్రాజెక్టులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుండెపోటును ముందుగానే గుర్తించే పరికరాలు స్టెమీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేశారు. అలాగే హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రితో అనుసంధానం చేస్తూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని ఇదే ఆవరణలో ఏర్పాటు చేశారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజని ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే సియామ్ యంత్ర పరికరాలు (శస్త్ర చికిత్సలు చేసే పరికరాలు), ఫిజియోథెరపిస్ట్ యూనిట్, సిబ్బందిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రత్యేక వైద్య నిపుణులను నియమించడంతో శస్త్ర చికిత్సలు రెట్టింపు అయ్యాయి. గతంలో మినీ ఘోషాసుపత్రిగా పేరొందిన ఆస్పత్రి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మినీ కేజీహెచ్‌గా రూపాంతరం చెందుతుందనడంలో సందేహం లేదని రోగులు చెబుతున్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు


తనిఖీ కేంద్రం వద్ద వేచి ఉన్న గర్భిణులు

గతంలో బుధ, శుక్రవారాల్లో మాత్రమే ప్రసూతి, గర్భిణులకు పత్యేక తనిఖీలు ఉండేవి. ప్రస్తుతం వారంలో అన్ని రోజులు ప్రత్యేక సేవలు అందుతున్నాయి.సివిల్ సర్జన్ డాక్టర్ ప్రసన్నలక్ష్మితో పాటు గైనిక్ బృందం కూడా ప్రత్యేక చొరవ తీసుకోవడంతో క్రిటికల్ కేసులకు కూడా మంచి వైద్య సేవలు అందుతున్నాయి. బుధ, శుక్రవారాల్లో అయితే ఈ విభాగం వద్ద చాలా రద్దీ కనిపిస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో వసతులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.17 కోట్లతో అగనంపూడి ఆస్పత్రి రూపం మార్చారు. సిబ్బందిని నాలుగింతలకు రెట్టింపు చేశారు. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అగనంపూడి ఆస్పత్రి ఓపీ రెండింతలు పెరిగింది. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడం వల్ల పేదలకు మంచి వైద్య అందుతుంది.

– బలిరెడ్డి నాగేశ్వరరావు, కొండయ్యవలస

రిఫరల్ బాధ తప్పింది



గతంలో ఏ మాత్రం పెద్ద సమస్య అనిపించినా వెంటనే కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. ఇప్పుడు ఆ సమస్య తప్పింది. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉండడంతో నాణ్యమైన వైద్యం అందుతోంది. అనారోగ్య పరిస్థితి ఎదురైతే అగనంపూడి ఆస్పత్రి అండగా ఉంటుందనే ఆలోచన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది.

– పి.పి.రామారావు, రాసాలమ్మకాలనీ

డిజిటల్ టోకెన్ సిస్టమ్‌తో తప్పిన ఇక్కట్లు


ఓపీ కేంద్రాల వద్ద రోగులు, వారి సహాయకులు, (ఇన్‌సెట్‌లో) ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు

గతంలో ఓపీ కేంద్రం వద్ద ఆన్‌లైన్ చేయడం, ఓపీ కౌంటర్ల వద్ద రోగులు, వారి సహాయకులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, ఏవో రవిరాజు చొరవతో ఓపీ కౌంటర్ వద్ద డిజిటల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. రోగులు, వారి సహాయకులకు ఎదురుగా బెంచీలు ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డులో టోకెన్లు నంబర్లు ప్రదర్శించి సౌండ్ సిస్టంలో చెబుతుంది. దీంతో టోకెన్ ప్రకారం రోగులు కేటాయించిన ఓపీ కేంద్రాల వద్దకు వెళ్లే వెసులుబాటు కల్పించారు. వీరి చొరవ వల్ల ప్రస్తుతం రోగులకు బాధలు తప్పాయి.

క్లుప్తంగా

వీఆర్‌ఎస్ ఉద్యోగులకు సత్కారం


సత్కారం అందుకుంటున్న వీఆర్‌ఎస్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) పొందుతున్న ఉద్యోగులను సోమవారం ఘనంగా సత్కరించారు. విభాగం కాన్ఫరెన్స్ హాలులో డీజీఎం తంగేటి శేషాచలాచారి, అములోజు శ్రీనివాసరావు, లక్కోజు శ్రీనివాస మూర్తిలను సత్కరించారు. కార్యక్రమంలో డీజీఎం దేవులపల్లి బ్రహ్మ, మునినాడ శ్రీనివాసు, ఎం.అనిల్, అర్జునాచారి, ఈ. రవీంద్ర, పి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ప్రాంత అభివృద్ధికి సహకారం

అగనంపూడి: అగనంపూడి జోన్ ఏర్పాటు చేయడం సంతోషమని, ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని అగనంపూడికి చెందిన కూటమి నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. జోన్ ఏర్పాటు చేయడానికి చొరవతీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రసాదుల శ్రీను, నాయకులు కర్రి దశేంద్ర, ఇల్లపు ప్రసాద్, డొక్కా రమేష్, కరణం సత్యారావు, గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు


మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు తదితరులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు సిద్దార్థనగర్‌లోని మంచినీటి శుద్ధి ప్లాంటుకు సోమవారం మరమ్మతులు నిర్వహించారు. క్లోరినేషన్ ట్యాంకులో పేరుకు పోయిన మట్టిని తొలగించారు. అలాగే పంప్‌హౌస్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పొక్లెయిన్ల సాయంతో శుభ్రం చేశారు. నీటి సరఫరా విభాగం ఈఈ శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. నిలువెత్తు లోతులో పేరుకుపోయిన బంకమట్టిని తొలగించడానికి సిబ్బంది చాలా కష్టపడాల్సి వచ్చింది. మరమ్మతులు నిర్వహించడం వల్ల 86,87 వార్డులకు మంచినీటి సరఫరా నిలిచి పోయింది. మట్టిని తొలగించడంతో మోటార్లకు చిన్న రిపేర్లు కూడా పూర్తిచేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యకమంలో డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న సీఐ పార్థసారథి తదితరులు

గాజువాక: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతకర్ణవానిపాలెంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక సీఐ పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు వేలమంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాటా శ్రీనివాస్, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, మహిళా కమిటీ నాయకులు వరలక్ష్మి, జ్యోతి, రూప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి భరోసా


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: మహిళల ఆరోగ్యానికి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌తో భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 66వ వార్డులోని యూపీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత, స్థానిక నాయకులు మహ్మద్ రఫీ, కరణంరెడ్డి నర్సింగరావు, గోమాడ వాసు, ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా దసరా ఉత్సవాలు



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన. పదితలల రావణాసురినికి నిప్పంటిస్తున్న కళాశాల సిబ్బంది

అగనంపూడి: దసరా సంబరాలు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఉత్సవాన్ని కళ్లకు కట్టారు. ఈ సందర్భంగా రంగోళి, ఐడిల్ మేకింగ్‌పై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు దసరా ప్రత్యేకతను వివరించారు. వివిధ విభాగాల డీన్లు, హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పందులను నిర్మూలించాలని వినతి

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డులోని వివిధ కాలనీల్లో పందుల బెడద పెరిగిపోయిందని మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతి పత్రం సమర్పించారు. శ్రీరామ్‌నగర్, శ్రీనగర్, ఉప్పర కాలనీ, గురునాధరావు కాలనీలో పందు లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయి పందుల పెంపకం దార్లకు స్థావరాలుగా మారాయని పేర్కొన్నారు. పందులను నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఉత్పత్తి పెంచడానికి సహకరించండి


ఉక్కు భద్రతా విభాగం జీఎంను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: భద్రతతో కూడిన ఉత్పత్తికి పెంచడానికి సహకరించాలని ఉక్కు భద్రతా విభాగం జనరల్ మేనేజర్ ఎస్. రవి కోరారు. ఉక్కు భద్రతా విభాగాధిపతిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య తదితరులు ఆయన్ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం రవి మాట్లాడుతూ మానవ వనరులు సురక్షితంగా ఉండడం భద్రతా విభాగం ప్రాధాన్యత అన్నారు. అధిక ఉత్పత్తి సాధించడం ఉద్యోగుల లక్ష్యమన్నారు. ఈ రెండింటిని మేళవించి ఉత్పత్తి సాధిస్తే ఆ సంస్థ ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం వరప్రసాదరావు, అధికారులు మోహనరావు, టిర్కీ, సాయి ప్రసాద్, నాయకులు ఎస్. మోహన్‌బాబు, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86 వార్డు గ్రీన్ ల్యాండ్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సంప్రాదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మహిళలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు మల్లికార్జున, ఉక్కు ఉద్యోగులు వెంకటేశ్వరులు, నర్సింహారావు, ఆనంద్, శ్రావణ్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.


బతుకమ్మసంబరాల్లో పాల్గొన్న తిప్పలదేవన్‌రెడ్డి, సంబరాల్లో పాల్గొన్న మహిళలు

అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయవద్దు


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు, సభ్యులు

గాజువాక: పెదగంట్యాడ మండలంలో అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు నాయకులు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పోర్టుతోపాటు వివిధ పరిశ్రమల నుంచి ఉత్పన్నమవుతున్న కాలుష్యం వల్ల గాజువాక ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే పెదగంట్యాడ, గాజువాక, మల్కాపురం, ఎన్ఏడీ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 10 లక్షల మంది ప్రజలు కాలుష్యానికి బలవుతారని వివరించారు. ఈ పరిస్థితుల్లో అదానీ సిమెంట్ పరిశ్రమలకు సంబంధించి వచ్చేనెల 8న నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్నారు.వినతి పత్రం అందజేసినవారిలో కార్పొరేటర్ గంధం శ్రీను, జేఏసీ నాయకులు ఎం.రాంబాబు, మంత్రి శంకరనారాయణ, డి.రమణ, జి.లక్ష్మి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజలు


సరస్వతీదేవిగా సూదికొండపై వెలసిన దుర్గా భవాని, మహాసరస్వతీదేవిగా మహాదుర్గ

పెదగంట్యాడ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం మూల నక్షత్రం సందర్భంగా దుర్గాదేవిని సరస్వతీ దేవిగా అలంకరించారు. అమ్మవారి ఆలయాలతో పాటు ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించడానికి విద్యార్థులు బారులు తీరారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయంలోవాసవీమాతను సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యలో ఏర్పాటు చేసిన సామూహిక సరస్వతీ దేవి పూజలో పరిసర ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు.


వాసవీ పంచాయతన ఆలయంలో...

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


ఉక్కు త్రిశక్తి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాల్లో తల్లిదండ్రులు, పిల్లలు

- బర్మా కాలనీలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జీవీఎంసీ 64వ వార్డు దిబ్బపాలెం గ్రామంలో సీ టైగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతలపూడి వెంకటరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము ,యూత్ సభ్యులు పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయంలో..

ఉక్కునగరం: మూలానక్షత్రం పురస్కరించుకుని త్రిశక్తి దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు సహస్ర శ్వేత కుసుమార్చన చేశారు.ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సరస్వతీ నమస్తుభ్యం

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు పెద మడక సూదికొండపైనున్న మాతా దుర్గా భవానీ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో అలంకరించి బాలలతో పూజలు చేయించారు. తర్వాత డాక్టర్ తాతాజీ సహకారంతో బాలలకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, హయగ్రీవుని చిత్రపటాలు అందించారు. ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు పాల్గొన్నారు.


దిబ్బపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న చింతలపూడి వెంకటరామయ్య


బర్మా కాలనీలో పూజలు చేయిస్తున్న ఆలయ అర్చకుడు శర్మ

- అగనంపూడిలో దుర్గాలమ్మను స్వతీదేవి రూపంలో అలంకరించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి పారాయణం పఠించింది.
- అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆవరణలో దుర్గాదేవిని సరస్వతీదేవి చైతన్య స్వరూపిణిగా అలంకరింపజేసి విశేష పూజలు నిర్వహించారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజయోగి సోమేశ్వరి , అగనంపూడి ఇన్‌చార్జి రామకోటి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని పాదయాత్ర


40వ వార్డులో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సింథియా: పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టవద్దని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో 40వ వార్డు ఏకేసీకాలనీలో ఆ పార్టీ నాయకులు సోమవారవ పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం మల్కాపురం జోన్ కారదర్శి పైడిరాజు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే వాయు కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధుల బారిన పడి ప్రజలు ఆస్పత్రి పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీలో కేవలం 250 మందికి మాత్రమే ఉపాధి కలుగుతుందని, కానీ 10 లక్షల మంది ప్రజల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జోన్ నాయకులు కె.పెంటారావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 8న జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సత్యారావు, పీవీ భాస్కరరావు, జి.నరేష్, ఎం.కోటి, సురేష్ పాల్గొన్నారు.